

ఈ జర్నీ చాలా సౌకర్యవంతంగా ఉంది

- చిర్ర వెంకటేశ్వర్లు, ప్రభుత్వ టీచర్

ఉరుకులు పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను దుగ్గొండిలో పని చేస్తా. సొంత వాహనం వాడనప్పుడు ఈ సర్వీసులపై ఆధారపడతా. ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే వరంగల్ బస్టేషన్‌కు వెళ్లాలి. నేను పెగడపల్లి డబ్బాల జంక్షన్ వద్ద ఉంటాను. స్కూల్‌కు ఆలస్యం అవుతుందనుకుంటే ఇంటి వద్ద నుంచి ర్యాపిడో సర్వీసులో టూ వీలర్ బుక్ చేసుకుని వెళతాను. రూ.70చార్జీతో సేఫ్‌గా వరంగల్ బస్‌స్టేషన్ చేరుకుంటా. ప్రైవేటు ఆటోలో వెళ్లాలంటే మా ఇంటి నుంచి అర కిలోమీటర్ నడిచి వెళ్లాలి. ర్యాపిడో అయితే బుక్ చేసిన క్షణాల్లో ఇంటి వద్దకు వచ్చి చేరుకుంటుంది. ఈ అవకాశాన్ని నగరంలోని చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

భలే చౌక.. జర్నీ

తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు..

- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

Sunday SPECIAL

ఇప్పుడంతా ఉరుకులపరుగుల జీవితం. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రపోయే వరకు అంతా బిజీబిజీ. ఇక నగర వాసుల గురించైతే చెప్పే పనేలేదు. ప్రతీ క్షణమూ విలువైనదే అన్నట్టుగా వారి దైనందిన జీవితం సాగుతుంది. అలాంటి నగర వాసులు నిత్యం ఎదుర్కొనేది ప్రయాణ ప్రయాస.. ట్రాఫిక్ ఇబ్బందులు. ఈ క్రమంలోనే నగర వాసులకు ముఖ్యంగా అన్ని వర్గాల ఉద్యోగులకు సాంకేతికత బాసటగా నిలుస్తోంది. కొన్ని వాహనరైడ్ యాప్‌లు అందుబాటులోకి రాగా.. ఆ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిమిషాల వ్యవధిలో ఉన్నచోటుకు వచ్చి తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. దీంతో సొంత వాహనాలున్న వారు కూడా ఈ రైడ్స్ పట్ల ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీల్లో మూడు ప్రముఖ సంస్థలు యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువచార్జీకే ఉన్నచోటు నుంచి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోవడంతో పాటు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నామంటున్నారు.

- రాంనగర్

వివరాలు : 7లో..

పీడీఎస్ బియ్యం పట్టివేతలో హైడ్రామా

- పొగుళ్లపల్లిలో గ్రామస్థుల సమాచారంతో రైస్ స్వాధీనం
- రాణాకు తరలిస్తుండగా వాహనం, బియ్యం తప్పించిన వైనం
- డీఎస్పీ, ఎస్పీకి గ్రామస్థుల ఫిర్యాదు
- 16 గంటల తరువాత వెహికిల్ గుర్తింపు





పీడీఎస్ బియ్యంతో వాహనం

కొత్తగూడ, ఆగస్టు 24 : మండలంలోని పొగుళ్లపల్లిలో ప్రజాపంపిణీ బియ్యం పట్టివేతలో పోలీసులకు, అక్రమ రవాణాదారుడికి మధ్య శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు హైడ్రామా కొనసాగింది. గ్రామస్థులు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక పోలీసులు పక్కదారి పట్టిస్తున్నారనే క్రమంలో సదరు గ్రామస్థులు ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం చేరవేసి, పకడ్బందీగా అక్రమదారుడిని తప్పించుకోకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఘటనకు సబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పొగుళ్లపల్లికి చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అక్రమంగా పీడీఎస్ బియ్యం దందా చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో రేషన్ బియ్యం తరలించేందుకు పొగుళ్లపల్లిలో ఏపీ 36వై 4070 అనే బొలెరో వాహనంలో లోడ్ చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఫొటోలు తీసి, ఎస్సై కుశకుమార్‌కు పంపించి, సమాచారం అందించారు. దీంతో పొగుళ్లపల్లికి చేరుకున్న ఎస్సై ఆ వాహనాన్ని వదిలి తిరిగి వెళ్లిపోవడంతో యువకులు మానుకోట డీఎస్పీకి వాట్సాప్‌లో ఫొటోలు పంపించి ఫోన్‌చేసి విషయాన్ని చెప్పారు. దీంతో ఎస్సైకి అర్ధరాత్రి దాటిన తర్వాత డీఎస్పీ ఆదేశాలు ఇవ్వడంతో సిబ్బందితో పొగుళ్లపల్లి చేరుకున్న ఎస్సై.. గ్రామ శివారుతో పాటు ఇతర గ్రామాల్లో వాహనం కోసం వెతికారు. శనివారం ఉదయం యువకులు ఇదే సమాచారాన్ని, ఫొటోలను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కి చేరవేశారు. స్పందించిన ఎస్పీ.. విచారణ చేయాలని డీఎస్పీకి ఆదేశాలిచ్చారు. దీంతో ఎస్సై కుశకుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన డీఎస్పీ.. వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాదారులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. దీంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు వాహనంతో పాటు, బియ్యం, అక్రమ రవాణాదారుల కోసం పలు పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి, గాలింపులు చేపట్టారు. ఎట్టకేలకు సాయంత్రం 4 గంటలకు బియ్యం లోడులేని వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. రాణాకు తీసుకెళ్లారు. తర్వాత కొత్తగూడకు చేరుకున్న డీఎస్పీ.. వాహనంలో బియ్యం లోడు లేకపోవడంతో ఆగ్రహించి, సదరు అక్రమ రవాణాదారులను తమదైన పద్ధతిలో విచారించారు. దీంతో ఒప్పుకున్న అక్రమార్కులు బియ్యం మండలంలోని నీలంపల్లిలో బియ్యం ఉన్నాయని తెలిపారు. అయితే ఆ లోడును వారితోనే వాహనంలో మరో సారి స్టేషన్‌కు తెప్పించినట్టు సమాచారం!

బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై కుశకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని పొగుళ్లపల్లిలో శుక్రవారం రాత్రి అక్రమంగా పీడీఎస్ బియ్యంను తరలిస్తున్నారనే సమాచారంతో గ్రామానికి చేరుకుని 25 క్వింటాళ్ల రైస్‌ను ఏపీ 36వై 4070 నెంబరు గల బొలేరో వాహనాన్ని సీజ్‌చేసి చేసినట్టు వివరించారు. పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన రాగి ఉపేంద్రచారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తరలిస్తుండగా వాహనాన్ని తప్పించారు..

- ఎస్సై కుశకుమార్

శుక్రవారం రాత్రి పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్న విషయంపై ఎస్సై కుశకుమార్‌ను వివరణ కోరగా.. పొగుళ్లపల్లిలో 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా.. మార్గం మధ్యలో అక్రమ రవాణాదారుడు వాహనాన్ని తప్పించాడని ఎస్సై తెలిపారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తాం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతుకు తప్పకుండా రుణమాఫీ చేసి తీరుతామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రుణమాఫీని మూడువిడతల్లో చేయడం జరుగుతుందన్నారు. కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో టెక్నికల్ సమస్య ఉందని, దానిని త్వరలోనే పరిష్కరించి మాఫీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీపై రైతులకు తప్పుడు సమాచారం ఇస్తూ వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ కానీ రైతులు కలెక్టర్ కార్యాలయంలో కానీ, తహసీల్దార్ కార్యాలయాల్లో కానీ, బ్యాంకు అధికారులను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికా రి విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత..

మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్, నెల్లికుదురు, కేసముద్రం మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కౌన్సిలర్లు పోతురాజు రాజు, కోడి నాగమణి శ్రీనివాస్, జగన్, శ్రీను, అజ్మీర సురేష్, కార్తీక్, ఎడ్ల రమేష్, బండారు వెంకన్న పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మురళీనాయక్

బీఆర్‌ఎస్‌వి బూటకపు ధర్నాలు

- సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరిచిపోలేదు
- రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

7



శ్రీముసలమ్మ ఆలయ ఈవోగా శేషగిరి



కొత్తగూడ, ఆగస్టు 24 : గుంజేడు శ్రీముసలమ్మ ఆలయం ఈవోగాశేషగిరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన భిక్షమాచారి ఇటీవల ఏసీబీదాడుల్లో పట్టుబడ్డాడు. ఆయన స్థానంలో నూతన ఈవోగా గీసుకొండ మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఈవోగా పని చేసిన ఈవో శేషగిరి బదిలీపై వచ్చి ఈవోగా బాధ్యతలు స్వీకరించాడు. ఎండోమెంట్ డివిజనల్ ఇన్స్‌పెక్టర్ కవిత నూతన ఈవో శేషగిరికి బాధ్యతలు అప్పగించారు.

పథకాల అమల్లో వేగం పెంచాలి

- రుణమాఫీ పూర్తి చేయకపోతే మూల్యం తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ముగిసిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బాలసముద్రం, ఆగస్టు 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ఇతర సంక్షేమ పథకాల అమల్లో వేగం పెంచాలని, అలాగే హామీల ను కూడా వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడురోజులుగా హనుమకొండ హరితహోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, అజీజ్ పాషాతో కలిసి మాట్లాడిన ఆయన ప్రభుత్వం ధరణి స్థానంలో ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై లోతుగా చర్చించి అందరి అభిప్రాయాలు తీసుకుని చట్టం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నమాట వాస్తవమే అయినా, హామీల అమల్లో ఇలానే వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్లస్థలాలు, పింఛన్ల పెంపు అమలుకు తక్షణం పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలో ఆశించిన స్థాయిలో అమలు కావడంలేదన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో, పలు సాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ రూ.500లకు గ్యాస్ సిలిండర్ హామీలు పేదలందరికీ వర్తించడంలేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, తక్షణం ప్రభుత్వం రూ.2లక్షల్లోపు రుణమాఫీ పూర్తి చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవలి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలతో ఎక్కువ సమయం వృథా అయిందని, ప్రజల సమస్యలపై అంతంత మాత్రంగానే చర్చ జరిగిందన్నారు. అర్థవంతమైన చర్చలకు, శాసనసభ వేదికగా ఉండాలని అప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ముగిసిన సమావేశాలు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. 22వ తేదీన ప్రారంభమైన ఈ నిర్మాణ సమావేశాలకు రాష్ట్రసమితి సభ్యులు, ఆహ్వానితులు మొత్తం 124 మంది హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి

మిగతా 8వ పేజీలో..

రుణమాఫీ కాని రైతులతో గ్రీవెన్స్ సెల్ కిటకిట

- మూడు రోజుల్లో 3,891 మంది ఫిర్యాదులు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు



రైతు వేదికలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అగస్టు 24 : రుణమాఫీ కాని రైతులతో గ్రీవెన్స్ కిటకిటలాడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయగా.. కొందరికి వివిధ కారణాలతో మాఫీ కాలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులు వివరాలతో గ్రీవెన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా, మండల వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. మా రుణం మాఫీ అయిందా! కాలేదా...? ఎందుకు కాలేదంటూ..? వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో కూడా భారీగానే క్యూ కట్టి, దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌కు శుక్రవారం నాటి వరకు 3,891 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదు చేసినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇంకా ఫిర్యాదులు చేయని బాధిత రైతులు మరేందరో ఉన్నారు.

జిల్లాలో రుణమాఫీ ఇలా..

రూ.రెండు లక్షల లోపు బాకీఉన్న రైతులకు ఆగస్టు 15 తేదీ లోపు రుణమాఫీ చేసి తీరుతా మని సీఎం ప్రకటించిన విధంగానే అమలు చేసి చూపారు. జూలై 18న మొదటి విడతగా రూ.లక్ష, జూలై 30 రెండో విడతగా రూ.1.50 లక్షల వరకు, మూడో విడతగా ఆగస్టు 15న రూ.2 లక్షల లోపు రుణం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లాలో మొదటి విడతగా 27,652 మంది రైతులకు రూ.156.02 కోట్లు, రెండో విడతలో 20,426 మంది బ్యాంకు ఖాతాలకు రూ.201.93 కోట్లు, మూడో విడతలో 13,360 మంది ఖాతాలకు రూ.225.13 కోట్లు రుణమాఫీ జరిగినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. అయితే లీడ్ బ్యాంక్ అధికారులు మాత్రం మూడు విడతలు కలిపి 58,193 మంది రైతులకు రూ.561.00 కోట్లు మాఫీ జరిగినట్లు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా కొన్ని కెనరా, ఐఓబీ, ఇండియన్ బ్యాంకుల్లో అత్యధిక మంది రైతులకు రుణమాఫీ జరుగకపోవడంతో మహబూబాబాద్ జిల్లాలోని ఆ బ్యాంకులు ఉన్న పరిధి గ్రామాల్లో రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ మండలం అమనగల్, ఇనుగుర్తి, మహబూబాబాద్ బ్యాంకుల్లో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే పాత అకౌంట్‌లు

మిగతా 8వ పేజీలో..

మండలం	ఫిర్యాదులు
మహ-బాద్	334
కేసముద్రం	144
ఇనుగుర్తి	105
నెల్లికుదురు	172
గూడూరు	140
బయ్యారం	108
గార్ల	69
కొత్తగూడ	110
గంగారం	38
మరిపెడ	689
చిన్నగూడూరు	602
నర్సింహులపేట	121
దంతాలపల్లి	174
తొర్రూరు	152
పెద్దవంగర	91
డోర్నకల్	180
కురవి	461
సీరోలు	201
మొత్తం	3891

డ్రగ్స్‌తో అనర్థాలపై అవగాహన కల్పించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం, ఆగస్టు 24 : విద్యార్థుల ప్రవర్తనపై కళాశాలల యాజమాన్యాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నగరంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కళాశాలల యాజమన్యాలను నమ్మి పిల్లలను తల్లిదండ్రులు పంపిస్తున్నారని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాస్టల్స్, క్యాంటీన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. కళాశాల పరిసరాల్లో గంజాయి సేవించినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవిందర్, ఏసీపీలు జితెందర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పునర్వైభవం వచ్చేనా?

నేడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 : విశ్వ క్రీడ వేదిక పై భారత దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా ప్రపంచానికి కనిపించే విధంగా ఒలంపిక్స్ పురుషుల హాకీ జట్టుకు ప్రాతినిథ్యం వహించి ఏకాంగా హ్యాట్రిక్ పసిడి పతకాలను అందించిన హాకీ దిగ్గజం మాణికట్టు మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్. తన క్రీడా ప్రతిభతో మైదానంలో రాకెట్‌లా దూసుకుపోతూ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ గోల్స్ చేసేవాడు. దేశవాలి క్రీడగా ప్రాచుర్యం పొందిన హాకీ క్రీడలో 1936సంవత్సరం మాస్కో విశ్వ క్రీడల్లో ధ్యాన్‌చంద్ సారథ్యంలో మన జట్టు చివరి పసిడి అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలో ధ్యాన్ చంద్ స్ఫూర్తితో భారత్‌కు మరో ఐదు స్వర్ణాలు, ఒక రజతం రెండు కాంస్య పతకాలతో సరిపెట్టుకొని అ తరువాత ఏలాంటి పతకాలు సాధించకుండా నాలుగు దశాబ్ధాలుగా వేచి చూడాల్సి వచ్చింది. 2021లో టోక్యోలో నిర్వహించిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో భారత దేశ జట్టు తరుపున మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలో 4దశబ్ధాల నిరీక్షణకు తెరతీస్తు చారిత్రాత్మక విజయాన్ని దేశానికి అందించి కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపాడు. అదే విధంగా ఆగస్టు 2024 పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో తృతీయ స్థానంలో నిలిచి వరుసగా రెండో సారీ కాంస్య పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ మరణం తరువాత ఒలంపిక్స్‌లో దేశానికి రెండు కాంస్య పతకాలు అందించిన స్ఫూర్తిని నేటీ క్రీడాకారులు తీసుకొని రాణించాల్సిన అవసరం ఉంది. 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సాధించిన ఘనతకు గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి ఏట నిర్వహించడం ఆనవాయితిగా వస్తుంది.

ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ అందించే అసోసియేషన్లు పూర్తి స్థాయిలో పర్యావేక్షణ లోపం కారణంగా ఈ క్రీడ పట్ల ఆసక్తి చూపడం లేదని పలువురు సీనియర్ క్రీడాకారులు వాపోతున్నారు. కోచ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ క్రీడ అంతరించి పోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జేఎన్‌ఎస్‌ఎస్‌లో పలు క్రీడలకు వేదికలు, కోర్టులు ఉన్నప్పటికీ దేశవాళి క్రీడగా ప్రసిద్ధి గాంచిన హాకీ క్రీడకు మైదానం లేకపోవడంతో ఈ క్రీడ పట్ల జిల్లా క్రీడా సమాఖ్య ఎంత నిర్లక్ష్యం చేస్తుందో ఇట్టే అర్థమవుతోంది.

సండే స్పెషల్
SUNDAY SPECIAL



భలే చౌక.. జర్నీ

- తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు
- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

రాంనగర్, ఆగస్టు 24: త్రినగరిలో చాలా చౌకగా.. తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేర్చేందుకు పలు యాప్‌ల ద్వారా వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాన్ని వరంగల్, హనుమకొండ, కాజీపేట (త్రి నగరి) ప్రజలు వినియోగించుకుంటున్నారు. పలు యాప్‌లు కార్పొరేషన్ పరిధిలో తమ సేవలను అందిస్తుండగా ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిలుచున్న స్థానం నుంచి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునే సౌకర్యం కలుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో సౌకర్యవంతంగా ఉన్నాయని నగరవాసులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు యాప్‌లు నగర పరిధి లోనే అందుబాటులో ఉండగా వినియోగదారుల అభిప్రాయం మేరకు మున్ముందు హైదరాబాద్ వరకు సర్వీసు అందించే అవకాశం ఉన్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

అందుబాటులో యాప్‌లు..
చౌకగా ప్రయాణం..

ప్రస్తుతం నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మూడు యాప్‌లు బైక్, ఆటో, కార్ సౌకర్యం కల్పిస్తున్నాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి బుక్ చేసుకుంటే క్షణాల్లో ఇంటికి వాహనం వస్తుంది. యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే వాహనాలు, ఇతర రెంటెడ్ వాహనాలకు చార్జీల్లో చాలా తేడా ఉంటోంది. చౌకగా కోరుకున్న స్థానానికి చేరుకోవచ్చు. ఏ టైమ్‌లోనైనా యాప్‌ల ద్వారా ప్రయాణం సురక్షితమని, ఒకరి కంటే ఎక్కువ ఉన్నవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటే బయటికంటే సగం చార్జీలకంటే మించకుండా ప్రయాణం చేసే వీలుందని వినియోగదారులు చెబుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు బైక్‌లను బుక్ చేసుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో బైక్ సర్వీసుకు గిరాకీ బాగానే ఉన్నట్టు తెలిసింది. వరంగల్ కోట, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం, కాజీపేట, వరంగల్ రైల్వే జంక్షన్‌లు, బస్టాండ్లకు ఆటో, బైక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒకరికంటే ఎక్కువ మంది ప్రయాణం చేయాల నుకునేవారు ఆటో లేదంటే కారు సర్వీసును వినియోగిస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారు సైతం ఈ యాప్‌లపై ఆధారపడుతుండటం విశేషం. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్ననేపథ్యంలో సొంతవాహనాలున్న వారు కూడా ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ల వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.

కొన్ని ప్రాంతాలకు వసూలు చేస్తున్న చార్జీలిలా (సుమారుగా)

- **ఓలా సర్వీసు:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు 7.5 కి.మీ దూరానికి బైక్ రూ.58, ఆటో (ముగ్గురు) రూ.114, కార్ (నలుగురు) రూ.230 చార్జీ ఉంటుంది. అదే కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు 8కి.మీ దూరానికి బైక్ రూ.80, ఆటో రూ.140, కారు రూ.300చార్జి వసూలు చేస్తున్నారు.
- **ఊబర్ :** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్‌కు ఆటో రూ.114, కారు రూ.215 చార్జీ ఉంటుంది. కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఆటో రూ.160, కారు రూ.318 చార్జీ.
- **ర్యాపిడో:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్‌కు బైక్ రూ.77, ఆటో రూ.120, కారురూ.207 చార్జీ తీసుకుంటున్నారు. ఇక కేయూ జంక్షన్ నుంచి వ రంగల్ రైల్వేస్టేషన్ వరకు బైక్ అయితే రూ.100, ఆటో కు రూ.160, కారు రూ.270 చార్జీ.

తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు

- గడ్డం కుమారస్వామి, వ్యాపారి



ఈ యాప్‌లు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు. సొంత వాహనాలు ఉన్నా నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌లను వినియోగించుకుంటున్నా. మేం ఉంటున్న విద్యారణ్యపురి నుంచి భద్రకాళి, వేయిస్తంభాల ఆలయంతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు కుటుంబసభ్యులతో వెళ్లాలనుకుంటే కారు లేదా ఆటో బుక్ చేసుకుంటాం. ముగ్గురం రూ.120చార్జీ మించకుండా ఆలయానికి వెళతాం. వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకున్నా రూ.200 మించదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలనుకుంటే రూ.300కంటే ఎక్కువవుతుంది. ఈ యాప్‌లు అందుబాటులోకి రావడంతో డబ్బులు ఆదా, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు

వేడుకగా 'ఎస్ఆర్' డైరెక్టర్ కూతురి వివాహ రిసెప్షన్

మడికొండ, ఆగస్టు 24: ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి ప్రథమ కుమార్తె సంజన-గౌతమ్‌ల రిసెప్షన్ వేడుక మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ
- భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్

వరంగల్ మెడికల్, ఆగస్టు 24 : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.స్వర్ణకు మారి నియమితులయ్యారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి. మురళీకృష్ణను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జీవో ఆర్టీ నెంబర్ 417ను విడుదల చేశారు. డాక్టర్ జి.స్వర్ణకుమారి 2005 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.

అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది తిరిగి ఎంజీఎంలోనే ప్రస్తు తం పని చేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. కాగా, డాక్టర్ జి.స్వర్ణకుమారి ఈ విధుల్లో చేరేందుకు కుటుంబ సమస్యల కారణంగా నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ వి.మురళీకృష్ణ ఇటీవలే ఎంజీఎం ఆస్పత్రికి పిల్లల విభాగం ప్రొఫెసర్‌గా విభాగం అధిపతిగా బదిలీపై వచ్చారు. నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది.

భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి. రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం భూపాలపల్లి మెడికల్ కళాశాలలో రాజేంద్రప్రసాద్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

అలాగే హనుమకొండలోని ప్రభుత్వ టీబీ, చాతి వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.సంజీవ్ కుమారి నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి రేడియో థెరపి ప్రొఫెసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజేశ్వరి, వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజాభరత్ కుమార్‌లను ప్రభుత్వం నియమించింది.

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి

- నాలుగు రోజుల్లో డెంగీతో ఇద్దరు మృతి
- భయాందోళనలో తొర్రూరు పట్టణప్రజలు



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24 : డెంగీ జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యుల కథనం ప్రకారం. నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన బేతమల్ల రమేష్-లక్ష్మీకాంత దంపతులు గత 20 ఏళ్లుగా తొర్రూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు ప్రేమ్‌కుమార్, కుమార్తె ప్రియాంక సంతానం. రమేష్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) బీటెక్ ఫైనల్ ఇయర్ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ, ఇటీవల కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 19వ తేదీన రాఖీ పండుగకు తన చెల్లెలుతో రాఖీ కట్టించుకునేందుకు తొర్రూరుకు రాగా, జ్వరం వచ్చింది. 22వ తేదీన తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని అడ్మిట్ కావాలనడంతో.. 23న పట్టణంలోని మరో ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉందని.. పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో ఖమ్మంలోని సురక్ష దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందాడు. కాగా, మృతుడి సోదరి ప్రియాంక బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కొద్ది రోజుల్లో కుమారుడు చేదోడు వాదోడుగా నిలుస్తాడని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు తీవ్ర నిరాశ ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణ లోపం

నాలుగు రోజుల వ్యవధిలో డెంగీ జ్వరంతో ఇద్దరు మృతి చెందడంతో తొర్రూరు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 20వ తేదీన పట్టణ కేంద్రానికి చెందిన హర్షిక (4) డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే! పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో మునిసిపాలిటీ సిబ్బంది చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో పారిశుధ్య లోపం ఏర్పడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

బీఆర్ఎస్‌వి బూటకపు ధర్నాలు

- రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 24 : రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులవి బూటకపు ధర్నాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. దేశంలోనే రుణమాఫీ చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని మండిపడ్డారు.

ఖమ్మంలో సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరువలేదు

రుణమాఫీని వక్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు ఆరాటపడుతున్నారని రవీందర్‌రావు దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయంలో ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘటన ఇంకా రైతులు మరచిపోలేదన్నారు. రైతలు బీఆర్ఎస్‌ను అధికారం నుంచి దించివేసినా ఇంకా ఆ పార్టీ నేతలు కళ్లు తెరవలేదన్నారు. రైతుల పొట్ట కొట్టిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సహకార సంఘాల ద్వారా దశల వారిగా రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం 27 రోజుల్లోనే 22 లక్షల మంది రైతులకు మొత్తంగా రూ. 18 కోట్ల రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ చేయడం జరిగిందని వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ తప్పక వర్తింపు

బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని రవీందర్‌రావు కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పక జరుగుతుందని చెప్పారు. సాంకేతిక సమస్యలు కొన్ని ఇతర కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ జరగడంలో జాప్యం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం వెను వెంటనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు ఎవరైతే అర్హులైన రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు పరిష్కార చర్యలతో రుణమాఫీ లబ్ధి పొందుతున్నారని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడు రైతుల కష్టాలు పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా రాజకీయ స్వార్థాన్ని మరిచి రైతులకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తే మంచిదన్నారు. లేని పక్షంలో రైతుల నుంచి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బీఆర్ఎస్ దగాకోరు మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

• బంగారు వెండి, అభరణాలు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24 : మానుకోట జిల్లా కేంద్రంతో పాటు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం తిమ్మరాయిని పహాడ్‌లో దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి బంగారు, వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన సంపంగి శేఖర్ రీకవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే మండలానికి చెందిన పంజాల రాజేష్ రికవరీ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఈనెల 13న మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఇంట్లో తాళం పగల గొట్టి వెండి, బంగారు ఆభరణాలతో పాటు రూ. 10 వేలు అపహరించుకపోయినట్లు చెప్పారు. వారి జల్సాల కోసం రూ.10 వేలు వాడుకున్నట్లు వెల్లడించారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయనిపహాడ్‌లో ఇరువురితో పాటు సోడా శేఖర్‌తో కలిసి దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన వెండిబంగారు ఆభరణాలను జిల్లా కేంద్రంలో విక్రయించేందుకు తాళ్లపూసపల్లి నుంచి ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వస్తుండగా మహర్షి పాఠశాల వద్ద వాహనాలు తనఖీలో వారు పట్టుబడినట్లు చెప్పారు. వెండి, బంగారు ఆభరణాలు, హోండా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ. 76,500 వరకు ఉంటుంద న్నారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయనిపహాడ్‌లో ఇరువురితో పాటు సోడా శేఖర్‌తో కలిసి దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. సంపంగి శేఖర్, పంజాల రాకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో సీఐ దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్, సీసీఎస్ ఎస్సై లింగయ్య, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోరీకి గురైన సొత్తును చూపుతున్న టౌన్ సీఐ దేవేందర్

నర్సింహారావు కాలనీలో చోరీ..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నర్సింహారావు కాలనీలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగి తులం బంగారం, తులం వెండి ఆభరణాలతో పాటు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. నర్సింహారావు కాలనీకి చెందిన నాముని మురళీకృష్ణ-మంజుల దంపతులు చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వ్యాపార పనులు ముగించుకుని శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటికి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి బీరువాలో చూడగా తులం బంగారం, తులం వెండితో పాటు రూ.7 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. దీంతో బాధితులు డయల్ 100కు కాల్‌చేసి సమాచారం ఇవ్వడంతో క్లూజ్‌టీం అధికారులు వచ్చి వేలిముద్రలు సేకరించినట్లు చెప్పారు. ఈ విషయంలో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాముని మురళీకృష్ణ చెప్పారు.

తనకు న్యాయం చేయాలంటూ.. పురుగుల మందు డబ్బాతో మహిళ నిరసన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24 : జిల్లా కేంద్రం శివారు శనిగపురానికి చెందిన ఓ మహిళ తనకు న్యాయం చేయాలంటూ శనివారం పురుగుల మందు చేతపట్టుకుని నిరసన వ్యక్తం చేసింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. శనిగపురం గ్రామానికి చెందిన మంద రవి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మారుతల్లి (సవతితల్లి) జ్యోతి శనిగపురంకు చేరుకుని రవి మృతదేహంపై పడి రోదిస్తూ గుండెపోటు రావడంతో అక్కడక్కడే మృతి చెందింది. మంద వెంకన్న మొదటి భార్య స్వరూప అనారోగ్యంతో 30 ఏళ్ల క్రితం చనిపోయింది. స్వరూపకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. దీంతో వెంకన్న పిల్లల పోషణ నిమిత్తం చిన్నగూడూరు మండలం జయ్యారంకు చెందిన జ్యోతిని రెండోవివాహం చేసుకున్నాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె సంతానం. వెంకన్న రైల్వే ట్రాక్ మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. కొంతకాలం తర్వాత వెంకన్న వలంటరీ రిటైర్మంట్ తీసుకున్నాడు. ఆ సమయంలో అతనికి రూ.40 లక్షలు రాగా, జ్యోతి తనకు పుట్టిన కుమార్తె సంగీతకు రూ.40 లక్షలను ఇచ్చింది. ఆపై కుమారుడు సాయికి రైల్వే ఉద్యోగం ఇప్పించారు. వెంకన్న మొదటి భార్య స్వరూపకు పుట్టిన ముగ్గురికి ఎలాంటి ఆస్తి పంపిణీ చేయకపోవడంతో పాటు వెంకన్న పేరిట ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమిని జ్యోతి తనపేరుపై పట్టా చేయించుకున్నట్లు చెప్పారు. శనిగపురంలో ఉన్న ఇంటిపై బ్యాంకు ద్వారా రూ.14 లక్షల రుణం కూడా జ్యోతి తీసుకుని వాడుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే మంద రవి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు మంద రవి భార్య స్వప్న తనకు న్యాయం చేసేంత వరకు వెంకన్న రెండో భార్య జ్యోతి మృతదేహాన్ని తీసుకువెళ్లొదంటూ మందు డబ్బాతో ఆందోళన చేపట్టింది.



శనిగపురంలో పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడు మంద రవి భార్య స్వప్న

ఇరువర్గాలు మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలకు చెందిన వారు స్వప్న పేరిట 20 గుంటల వ్యవసాయ భూమి రాయడంతో పాటు, ఇంటిపై ఉన్న లోను జ్యోతి కుమార్తె సంగీత తీర్చే స్వప్న పేరిట రాసే విధంగా తీర్మాణం చేయడంతో ఆమె ఆందోళన విరమించింది. అనంతరం జ్యోతి మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి, జయ్యారానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

పథకాల అమల్లో వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన నివేదికపై, పార్టీ నిర్మాణంపై విసృతంగా జరిగిన చర్చలో సభ్యులు పాల్గొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై సభ్యులు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. మొదటి రోజు పార్టీ పతాకాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆవిష్కరించి సమావేశాలను ప్రారంభించారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, చాడా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, వల్లా వెం కట్‌రెడ్డి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పరిణామాలు, పార్టీ నిర్మాణం, విస్తరణ, పటిష్ఠం చేయడం తదితర అంశాలపై తమ సందేశాలిచ్చారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, అధ్యక్షతన జరిగిన సమావేశాలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కలవేణ శంకర్, వి.ఎస్.బోస్, బాలమల్లేష్, నరసింహ పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులతో గ్రీవెన్స్ సెల్ కిటకిట

(5వ పేజీ తరువాయి)

క్లోజ్ చేయకుండా మళ్లీ రుణం ఇచ్చి రెన్యూవల్ చేస్తుండడంతో రుణమాఫీ జరుగలేదన్నట్లు రైతులు చెబుతున్నారు. రేషన్‌కార్డుల్లో కూడా పేరు లేకపోవడంతో అనేకమంది రైతుల ఖాతాలు పెండింగ్‌లో పడుతున్నాయి. రైతులకు పట్టా లేకపోవడంతో వన్‌బీ తోనూ, పాత పట్టాదారు పాస్‌పుస్తకంతో తీసుకున్నరైతులకు రుణాలకు మాఫీ కానట్లు పెండింగ్‌లో చూపిస్తున్నాయి. అలాగే పలు బ్యాంకుల అధికారులు పూర్తిగా రూ.2 లక్షల లోపు రైతుల వివరాలు అందించకపోవడంతో వ్యవసాయశాఖలోని సీఎల్‌డబ్ల్యూ పోర్టల్‌లో రైతుల పేర్లను చూపించడం లేదు.

రుణమాఫీలో అర్హత గల రైతులకు రుణమాఫీ జరుగలేదంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న దృష్ట్యా మహబూబాబాద్‌జిల్లా కేంద్రంతోపాటు ఆయా మండలకేంద్రాల్లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారు. శుక్రవారం నాటి వరకు 3,891 మంది రైతులు ఫిర్యాదులు చేశారు. ఎక్కువగా మరిపెడ, చిన్నగూడూరు, కురవి, మహబూబాబాద్ మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌కు రైతులు పోటెత్తుతున్నారు. అయితే రైతులు తమ సమస్యలను వివరిస్తూ గ్రీవెన్స్‌లో తప్పకుండా ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. కాగా, రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు మాత్రం ఎక్కువ మంది ఫిర్యాదు చేయలేదు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

• జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టీబీ తదితర వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో సూచించారు. కలెక్టర్ సమావేశ హాల్‌లో జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్స్, వైద్య సిబ్బందితో సీజనల్‌వ్యాధుల నియంత్రణపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లినికల్ యాక్ట్ -2010 ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులపై వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే వారియొక్క వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షకాలం సీజనల్‌వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అధికశాతం ఎక్కడ విషజ్వరాలు ప్రబలుతున్నాయో.. ఈ రిపోర్టుల వల్ల తెలుసుకుని ఆ ప్రాంతంలో ముందుస్తు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ చర్యల వలన సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఆశా, ఏఎన్ఎం, వైద్య సిబ్బందితో కలిసి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలను వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్యపరచడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల ద్వారా విషజ్వరాలను ప్రబలకుండా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, ల్యాబ్‌టెక్నిషియన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పో

డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థికి డెంగీ

మరిపెడ : మరిపెడలోని ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థి అన్వేశ్ (ఫైనల్ ఎంపీఎస్‌సీఎస్) డెంగీ జ్వరం బారిన పడ్డాడు. ఆ గురుకుల కళాశాలతో పాటు ఎస్టీ బాలికల మినీ గురుకులాన్ని మరిపెడ ఎంపీడీవో విజయ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. వంటలను చెక్ చేశారు. దోమలు, ఈగల నివారణపై అధికారులు, అక్కడి ఏఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. విద్యార్థి అన్వేశ్‌కు ప్రత్యేక వైద్యచికిత్సలు అందివ్వాలని పీహెచ్‌సీ వైద్యులను ఆమె ఆదేశించారు.

రూ.2.17 లక్షల వేతనాలు స్వాహా చేశారని ధర్నా

• కేసముద్రం విలేజ జీపీలో ఒకనెల జీతం గల్లంతు

• నివేదిక పంపాం : ఎంపీడీవో

కేసముద్రం, ఆగస్టు 24 : కేసముద్రం విలేజి గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బంది ఒకనెల వేతనాలను కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసుకున్నాడని ఆరోపిస్తూ జీపీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది వల్లందాసు అనిల్, నాగయ్య, అశోక్, శ్రీను, యాకయ్య, వెంకటయ్య, ప్రమోద్, అలివేల, మరియమ్మ, సునిత మాట్లాడారు. గత ఏడాది నవంబర్ నెల వేతనాలు రూ.2.17 లక్షలను జీపీలోని ఒక సిబ్బంది ఖాతాలోకి బదిలీ చేసి, కార్యదర్శి డ్రా చేసుకున్నాడని ఆరోపించారు. ఆ తర్వాత నెల నుంచి వేతనాలు సక్రమంగా ఇస్తూ వస్తున్నాడని తెలిపారు. వేతనాలు విడుదలైన రికార్డులను పరిశీలించగా స్వాహా చేసినట్లు తెలిసిందని చెప్పారు. ఈ విషయంపై ఎంపీడీవో హరిప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నెల వేతనాన్ని జీపీ సిబ్బంది రోమన్ ఖాతాలోకి బదిలీ చేసి, అప్పటి కార్యదర్శి మధునాయుడు విడుదల చేసుకున్నాడని తెలిపారు. ఈ అంశంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు వెల్లడించారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ సిబ్బంది

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దవంగర, ఆగస్టు24 : ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వడ్డెకొత్తపల్లిలో చోటు చేసుకున్నట్లు ఏఎస్సై విజయరాజు తెలిపారు. శనివారం ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. వడ్డెకొత్తపల్లికి చెందిన దంతాలపల్లి వెంకన్న (57) గత కాలంగా అనారోగ్యంతో బాధపతూ ఉన్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికి తగ్గపోవడంతో తీవ్ర మనస్థాపానికి ఇంట్లో ఎవరు లేని సమయంలో రేకుల షెడ్డులో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసి, శవ పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యార్థికి తృటిలో తప్పిన ప్రమాదం

• విద్యుదాఘాతంతో గాయాలు

• కర్రతో కొట్టడంతో ప్రమాదం బయటపడ్డ బాలుడు


కేసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తొమ్మిదో తరగతి విద్యార్థి భూక్య చరణ్‌కు తృటితో ప్రమాదం తప్పింది. బాధిత విద్యార్థి తెలిపిన ప్రకారం. పాఠశాల మైదానంలో మట్టి పోసేందుకు ఒక లారీ ఆవరణలోకి వస్తుండగా అక్కడే ఉన్న ఆరోగ్య ఉపకేంద్రానికి ఏర్పాటు చేసిన విద్యుత్ సర్వీస్‌వైరు అడ్డుగా ఉంది. దీంతో లారీ వెంటనున్న సూపర్‌వైజర్ ఒకరు వైరు తొలగించాలని చరణ్‌ను కోరడంతో ఆరోగ్య ఉపకేంద్రం భవనం పైకి ఎక్కాడు. చరణ్ పట్టుకున్న ప్రాంతంలో వైరుఫెయిల్ కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడే షాక్‌తో కొట్టుకుంటుండగా మరోవిద్యార్థి జాటోత్ బన్నీ హుటాహుటిన భవనంపైకి ఎక్కి కర్రతో చరణ్ చేయిపై కొట్టడంతో విద్యుత్ వైరు వదిలిపెట్టింది. ఈ క్రమంలో చరణ్ బొటనవేలికి గాయం కాగా విద్యార్థిని కిందకు దింపి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం సాయంత్రం డిస్‌చార్జ్ చేసి ఇంటికి పంపించారు. కిందనున్న విద్యార్థి సకాలంలో స్పందించి కర్రతో కొట్టడంతో చరణ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇనుగుర్తి, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల నందు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సీఈసీలో 10, హెచ్ఈసీలో 7 సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండుగల ప్రాముఖ్యతను తెలుపేందుకు వేడుకల నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : పండుగల ప్రాముఖ్యత, సాంస్కృతి సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలుపేందుకు పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి విజిత ప్రభాకర్ అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి విద్యాభారతి హైస్కూల్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు వేసిన శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టి వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. అనంతరం పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించినఇటీవల వెలువడిన ఆల్ ఇండియా పీజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో 3వేల ర్యాంకు సాధించిన పూర్వవిద్యార్థి చిలుకూరి గణేష్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



గణేష్‌ను సన్మానిస్తున్న కరస్పాండెంట్ విజితా ప్రభాకర్

బహుజనులకు రాజ్యాధికారం దక్కాలి

గూడూరు, ఆగస్టు24 : బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి అన్నారు. గూడూరులో ఎంసీపీఐ (యూ) మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద ఉత్పత్తి శక్తులైన బహుజనులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే పేద ప్రజలకు రాజ్యాంగ ఫలాలు సమానంగా దక్కుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఆ పార్టీ అనుబంధ సంఘం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈసం రామయ్య, జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, బందెల వీరస్వామి, గుండగాని సత్తయ్య, కటకం బుచ్చిరామయ్య వెల్పుల వెంకన్న, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

తొర్రూరు, ఆగస్టు 24 : బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో చేవెళ్ల ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి రాయపురం రాజ్‌కుమార్ శనివారం తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, రాజేష్, యాకయ్య, భరత్, విజయ్‌కుమార్, నవీన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేయడం అభినందనీయం

• ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : ప్రభుత్వ పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే విద్యార్థులకు సైకిళ్లు అందజేయడం అభినందనీయమని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మాధవాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఆరుగురు విద్యార్థినీ, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సంకా బద్రినారాయణ సతీమణి దివంగత సంకా రాజేశ్వరీ జ్ఞాపకార్థం సుమారు రూ. 65వేల విలువ గల సైకిళ్లను శనివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడుగు, బలహీన వర్గాల పిల్లలే ఏంటారని, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10 జీపీఏ సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించి, తమ వంతు సహకారం అందజేస్తానన్నారు. తొలుత రాజేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కురవి ఎస్సై సతీష్, మాజీ ప్రజాప్రతినిధులు ఇస్లావత్ వెంకన్న, మద్ది వెంకట్‌రెడ్డి, వీరన్న, అంజయ్య రాజేందర్, ఉపాధ్యాయులు వెంకన్న, స్నేహలత, సుజాత, సౌభాగ్య, నాగయ్య, చంద్రశేఖర్, రమాదేవి, వీరన్న, సంతోష్ అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ వీరలక్ష్మీ, కామాక్షి, శైలజ, స్వరూప పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న భూక్య మురళీనాయక్

డెంగీ మృతిపై డీఎంఅండ్‌హెచ్‌వో పరిశీలన

కేసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని పెనుగొండకు చెందిన 9నెలల చిన్నారి డెంగీతో మృతి చెందగా జిల్లా వైద్యాధికారి మురళీధర్ శనివారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన ఆడెపు కల్యాణ్, సలీమా దంపతులు ఖమ్మంలో పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి 9 నెలల కూతురు ఆద్యశ్రీకి తీవ్ర జ్వరం రావడంతో ఈనెల 21న వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడి చికిత్సపొందుతూ 22న డెంగ్యూ జ్వరంతో మృతి చెందినట్లు డీఎం అండ్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు గ్రామాన్ని పరిసరాలను పరిశీలించి జీపీ సిబ్బందితో పారిశుధ్యపనులు చేయించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరం నిర్వహించాలని సిబ్బందిని డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశించారు. కార్యక్రమంలో పీవో ఎన్‌సీవీబీడీసీపీ డాక్టర్ సుధీర్‌రెడ్డి, పీహెచ్‌సీ ఎంవో నంబీకిషోర్, సీహెచ్‌వో సాజిద్, హెచ్‌ఈవో రామకృష్ణ, ఎస్‌యూవో శ్రీనివాస్, హెచ్‌ఎస్ జనార్ధనాచారి, ప్రత్యేకాధికారి యాదగిరి, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

• ఇనుగుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్

ఇనుగుర్తి, ఆగస్టు 24 : వర్షకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇనుగుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కుమార్ అన్నారు. చీన్యాతండా, అయ్యగారిపల్లిలో శనివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తప్పులను సవరించేందుకు చర్యలు

• జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : జిల్లాలో 3వ, 8వ తరగతి గణిత పాఠ్యపుస్తకాల్లో ఏమైనా తప్పులుంటే సవరించాలని డీఈవో రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరంలో ముద్రించిన గణిత పాఠ్యపుస్తకాల్లో తప్పులుంటే సవరించాలనే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లాకు ఆదేశాలు జారీ చేశారని, ఈ మేరకు కేసముద్రం మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఏకాంబ్రం, సురేష్‌నాయుడు, రమేష్, అశోక్, యాదగిరిలకు అప్పగించినట్లు తెలిపారు. వీరితో పాటు జీఈసీవో విజయకుమారి పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 : దివ్యాంగ విద్యార్థులను ప్రేమతో ఆదరించాలని డీఈవో రామారావు అన్నారు. మహబూబాబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాలలో శనివారం సమగ్రశిక్ష, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలిమ్కో) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు జిల్లాస్థాయి ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరంలో గుర్తించబడిన దివ్యాంగులకు 3 నెలల్లో సహాయ ఉపకరణాలు అందించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డాక్టర్ విజయ్‌కుమార్, హెచ్ఎంలు కోటియా, ఝాన్సీరాణి, ఫిజియోథెరపిస్టు నిషత్, ఐఈఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పందిళ్లకు రాయితీలు

• జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 24 : కూరగాయల సాగును మరింత ప్రోత్సహించేందుకు గాను కూరగాయల మొక్కలపై, కూరగాయ పందిళ్లకు ప్రభుత్వం నుంచి రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మహబూబాబాద్‌లోని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టమాట, వంకాయ, నూతన పంటలైన క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రకోలీ, రెడ్ క్యాబేజీ, తదితర నారు మొక్కలకు అత్యంత ఆధునిక పద్ధతుల్లో జీడీమెట్లలోని ఉద్యాననైపుణ్య కేంద్రంతో పాటు ములుగు నర్సరీల్లో పెంచిన మొక్కలను రైతులకు ఎకరాకు 8 వేల మొక్కలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సాగునీరు మంచి నాణ్యత గల భూమి, ఇతర వసతులు కలిగిన రైతులు ఈ నారు మొక్కలను రాయితీపై పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమీపంలోని వ్యవసాయాధికారి, లేదా ఉద్యాన అధికారిని సంప్రదించాలన్నారు. అలాగే కూరగాయలు సాగు చేసే సమయంలో మెలైన యాజమాన్య పద్ధతులు, ఎత్తు మడులు, మల్చింగ్ విధానం, ట్రెల్లిస్ విధానం, పందిరి సాగు, సేంద్రియ పద్ధతులు, వేపనూనె, వర్మికంపోస్టు ఉపయోగాలపై వివరించడం జరుగుతుందన్నారు.

సీఎంను విమర్శించే హక్కు లేదు

• కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఘనపురపు అంజయ్య

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24 : సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుకు లేదని కాంగ్రెస్ మహబూబాబాద్ పట్టణాధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఎమ్మెల్సీ రవీందర్‌రావు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజినీకాంత్, డీసీసీ అధికార ప్రతినిధి ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్, సత్యమనోరమ, బాబురావు, వేణు, విజయలక్ష్మీ, రాందాస్, గోగుల మల్లయ్య పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి : బీజేపీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు24 : బూత్‌స్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి ఓ.ఎస్.రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ బీజేపీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయిలో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎలమంచిలి వెంకటేశ్వర్‌రావు, మోసంగి మురళి, ధర్మారపు వెంకన్న, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, కొణతం పెంటయ్య, ఇందుభారతి, భూక్య సంగీత, సురేందర్, దేవిక, భూక్య శ్రీను, రామడుగు వెంకటాచారి, చీకటి మహేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సిరికొండ సంపత్, సాయి, ముఖేష్, నాగమణి, రెహమాన్ పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

మరిపెడ, ఆగస్టు 24 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మహబూబాబాద్ జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సురేశ్ అన్నారు. మరిపెడలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో చట్టాలపై జిల్లా న్యాయసేవాధికారి సంస్థ తరఫున విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుహాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ మట్ట సరిత, మరిపెడ అదనపు ఎస్సై సంతోశ్, గురుకుల ప్రిన్సిపాల్, స్టాఫ్ పాల్గొన్నారు. అనంతరం మరిపెడలోని ఎస్సీ, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

• బయ్యారం మండల అఖిలపక్ష నేతల డిమాండ్

బయ్యారం, ఆగస్టు 24 : సీఎంసీ స్థలాన్ని కబ్జా చేసి ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించడాన్ని తక్షణమే నిలిపివేయాలని మండల అఖిలపక్ష పార్టీల నేతలు శనివారం బయ్యారంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బస్టాండ్ సెంటర్ సమీపంలో గల గ్రామానికి చెందిన స్థలంలో కొంత మంది గ్రామపంచాయతీ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అనుమతి పొందకుండా నిర్మాణాలు చేపట్టడం సరైంది కాదన్నారు. గ్రామానికి నష్టపరిచే ఎటువంటి కార్యక్రమాలు చేపట్టిన అఖిలపక్ష పార్టీలుగా అడ్డుకొని తీరుతామని, గ్రామాభివృద్ధి స్థలాన్ని సాధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు బయ్యారం తహసీల్దార్ విజయకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు మధుకర్ రెడ్డి, ఐలయ్య, ముసలయ్య, రాజన్న, బాబురావు, శ్రీను, జగ్గన్న, మురళి, ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కళింగరెడ్డి, సూర్యం, బిక్షం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ సమోదు

గార్ల, ఆగస్టు 24 : జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల సందర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిద్యం, సమాజ వనరుల నిత్యత్వావశ్యతపై ప్రజల్లో అవగాహన తీసుకరావాలన్నారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మౌళిక స్వరుప స్వభావాలను గురించి సవివరమైన శాస్త్రీయ ప్రాతిపదికతను వివరించి అవగాహన కల్పించాలన్నారు. టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోలోత్ శివనాయక్, అప్పయ్య, నాగేశ్వరరావు, పుల్లయ్య పాల్గొన్నారు.

స్కూళ్లను బలోపేతం చేయాలి

చిన్నగూడూరు, ఆగస్టు 24 : మండలానికి ఒక విద్యాధికారిని నియమించి ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంచు శ్రీశైలం అన్నారు. చిన్నగూడూరు ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్రామనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాక్షులుగా కృష్ణ, హరతి, కార్యదర్శులుగా జె.నాగేశ్వర్, సుగుణాకర్, స్వప్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, సువర్ణ, సంఘ సభ్యులు శ్రీనివాస్, వెంకన్న, ఉస్మాన్, సత్యం, శ్రావణి పాల్గొన్నారు.

జీపీలను పరిశీలించిన అధికారులు

దంతాలపల్లి, ఆగస్టు24 : మండలంలోని కుమ్మరికుంట్ల, ఆగపేట, తూర్పుతండా గ్రామపంచాయతీలను శనివారం ఎంపీడీవో విక్రమ్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీలో పెడింగ్‌లో ఉన్న కొన్ని చోట్ల పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. జీపీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. తూర్పుతండా జీపీ సిబ్బంది పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అప్సరపాషా పాల్గొన్నారు.

మరిపెడలో బీటీ రోడ్ల తనిఖీ

మరిపెడ, ఆగస్టు 24 : మండలంలోని పీఎంజీఎస్‌వై బీటీ రోడ్లను సెంట్రల్ క్యూసీ బృందం శనివారం తనిఖీ చేశారు. అనుమానం ఉన్న దగ్గర రోడ్డును తవ్వించి మెటీరియల్ పరీక్షించారు. నిర్మాణ ప్రమాణాలను పరిశీలించారు. మరిపెడ సాయిబాబా గుడి దగ్గర నుంచి మరిపెడ విలేజీ రోడ్డు, వీరారం రోడ్లను తనిఖీ చేశారు. శాంపిల్స్ తీసుకున్నారు. ఈ తనిఖీలో సెంట్రల్ క్యూసీ అధికారి అబ్దుల్ మాజీద్, పీఆర్ డీఈ నర్సింగ్‌నాయక్, ఏఈలు సబ్దర్‌అలీ, శ్రీనివాస్‌నాయక్, సుగుణాకర్, సాయినర్సింహా కన్‌స్ట్రక్షన్ ఎండీ జయసింహారెడ్డి ఉన్నారు.

'రుణమాఫీపై రాద్ధాంతం చేయడం సిగ్గుచేటు'

నర్సింహులపేట, ఆగస్టు 24 : రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న రాద్ధాంతం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్ అన్నారు. నర్సింహులపేటలోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ యువజన నాయకులు దాసరోజు రాజశేఖర్, పీఏసీఎస్ డైరెక్టర్ రజినీకాంత్‌రెడ్డి, మండల నాయకులు రవీందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, లింగారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు చిర్ర సతీష్‌గౌడ్, తోట సురేష్, మండల నాయకులు రామకృష్ణ, రమేష్, మహబూబ్‌ఖాన్, చల్ల మధు, మేరుగు నరేష్, ముఖేష్, వీరన్న పాల్గొన్నారు.